స్కెచ్

# విశ్వంలో మనిషి

నిట్టల శ్రీరామమూర్తి

ప్రతి ఉదయం పదిగంటలు! విశ్వం దురదృష్ట దేవతకి జయగంటలు! విశ్వనాథానికి ఆ పది గంటలంటే ఎంతో అర్థముంది. పదీ అయేసరికి, కారు కనిపించగానే అప్రయత్నంగా సిగ్నలిచ్చే బీటు కానిస్టేబులులాగ, రాస్తున్న ఫైలు కట్టి గట్టి నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని కచేరీకి పరుగెత్తటం అతనికి పరిపాటి అయిపోయింది. పదిహేనేళ్లు గడిచిపోయాయి.. రోజులు దొర్లిపోతూనే వున్నాయి. విశ్వం జీవితపోరాటంలో ప్రతిరోజూ ఆ పదిగంటలు అతని కచేరీ ప్రయాణానికి రణభేరి. ఒక యంత్రంలా అతని జీవితం అల్లా తిరిగిపోతూనే వుంది.

'పది' కొట్టేరు. అప్పుడే వీధిలోకి అడుగెడుతూన్న విశ్వం శారద మాటలు విని చటుక్కున ఆగిపోయాడు.

"చంటాడి పాలడబ్బా అయిపోయింది" అంది హీనస్వరంతో.

శారదకే తెలుసు విశ్వం చేతిలో కానీ లేదని. ఆ మాట విని అతను ఎంత బాధపడతాడో కూడా తెల్సు. దురదృష్ట దేవత తమని ఇలా పీల్చి పిప్పి చేస్తోంది. అయినా తల్లిప్రాణం పలికించింది.

"చంటాడి పాలడబ్బా అయిపోయింది!"

విశ్వం ఒక్కసారి ఆమెకేసి చూశాడు. లోతుకుపోయిన అతని కళ్లు నిరాశతో దిగాలుమంటున్నాయి, పైన ఆకాశంలో నల్లమబ్బులు క్రమ్ముకుంటున్నాయి. ఎండిన ఆమె వక్షంకేసి ఓసారి చూసి తలవంచుకుని బయలుదేరేడు. వర్షం ప్రారంభమైంది. గొడుగు విప్పేడు విశ్వం. గొడుగు చిల్లుల్లోంచి ఆకాశం కనబడుతోంది. జుట్టూ బట్టా తడుస్తున్నాయి...

ఉందన్న పేరుకి తనకీ వుంది ఓ గొడుగు .. చంటాడి ఆ ఆకలి ఏడ్పులు చెవుల్లో గింగురుమంటున్నాయి. గొడుగు బాగుచేయించుకుందుకి స్తోమతు లేదు. మరి పిల్లాడికి పాలడబ్బా కావాలి? గొడుగు, అంచుల్లోంచి కన్నీళ్లు కారుస్తోంది సానుభూతితో. గొడుగు చిల్లులకేసి చూసేడు విశ్వం నిస్సహాయంగా.

"తన హృదయంకూడా చిల్లులు పడింది కాలం పొడిచే సూదిపోట్లకు. ఆ చిల్లులగుండా ఎప్పుడో ఎగిరిపోయాయి తన ఆశలన్నీ!"

శుష్కించిన శారదని తల్చుకుని ఒక్క నిట్టూర్పు విడిచేడు విశ్వం.

తనకి లేకుండా చేసుకుని వున్న అన్నం కాస్తా పిల్లలకీ తనకీ పెట్టేసే శారద రూపు కనిపిస్తోంది. తను వట్టి అసమర్థుడు! ఆమెకు కావలసిన తిండీ, బట్టా ఇవ్వలేకపోయాడు. మిసమిసలాడుతూ బంతిలా వుండే శారద నకనకలాడుతూ వరడైపోయింది, తనని కట్టుకున్న ఫలితంగా! ఆఖరికి ఆమెకి పిల్లాడికి పాలిచ్చుకునే శక్తికూడా లేకపోయింది. పాలడబ్బా ఎలా కొనటం?

వర్షం ఎక్కువవుతోంది. కచేరీ యింకా మైలున్నర వుంది. పసిపాప ఏడుపు దారిపొడుగునా అతన్ని మనస్సులో వెంటాడుతూనేవుంది. శారద హీనస్వరం, అతని మెదడులో మెదులుతూనే వుంది. విశ్వానికి 'విశ్వం' అంతా శూన్యంగా కనిపించింది. తలనిండుగా అప్పుల్లో మునిగివున్నాడు. ఎవరిస్తారు పాలడబ్బాకి డబ్బు?

"దారిలో ఏదేనా పర్సు దొరికితే?"

రోడ్డు అంతా కలయ చూసేడు ఆశతో కూడిన బాధతో బురద అతన్ని వెక్కిరిస్తోంది.

"పోనీ ఏదేనా లాటరీవస్తే?" లక్షలూ, వేలూ అంకెలు సున్నాల్తో సహా అతని మెదడులో పరవళ్లు తొక్కేయి. సైడు కాలవలో బుడగలు కదం తొక్కుతున్నాయి.

"తన కామాత్రం అదృష్టం కూడానా?" బుడగల్ని మొట్టికాయలు మొకుతున్నాయి వాన చినుకులు.

"లేకపోతే తనకి వున్న పాళంగా ఆఫీసరుగా

ప్రమోషను అయినట్లు టెలిగ్రాం వస్తే? తనకి తెలీకుండానే ఏవో ఇంక్రిమెంట్లు సాంక్షన్ అయి తనకి కాష్ చేసుకుందికి బిల్లు వస్తే!... ఏవిటో తనకీ వెర్రి వూహాలు!"

విశ్వం ఒక్కసారి నీరసంగా నవ్వుకున్నాడు. వర్షం తీవ్రమైనది. ఆకాశాన్ని ఎవరో ఏడిపించినట్లున్నారు.

"అవన్నీ కలల్లోనూ, కథల్లోనూ, సినిమాల్లోనూ జరుగుతాయి. ఈ పదిహేనేళ్ళనించీ తను బ్రతకటమే ఓ సమస్య. ముందు కూడా అదే సమస్య. ఎన్నాళ్లో? ఏమవుతుందో? ఎవరికీ ఏమీ తెలీదు. ఆ కథలూ, సినిమాలూ, అన్నీ ఆ క్షణం ఓ విధమైన విచారం, సానుభూతినీ రేకెత్తిస్తాయి. మర్నాటినించీ మళ్ళీ మామూలే. సమస్య సమస్యగానే నిల్చిపోయింది. దీనికి పరిష్కారం ఎప్పుడు?"

ఈ ప్రశ్న విశ్వం వున్నంతకాలం అల్లాగే అగాని సమస్యగానే వుండిపోతుంది. వర్షం జోరులో చంటాడి ఏడుపు శ్రుతి కలిపి విశ్వం హృదయ తంతువుల మీటుతూ ఆలపిస్తోంది.

"ఇప్పుడు ఏంచెయ్యటం? పాలడబ్బా యెలా తేవటం?" ఇది నిజంగా, ఎదురుగుండా నిల్చి పరిస్థితులు అడిగే, ఎవరూ తీర్చలేని ప్రశ్న! ఇది జీవిత ప్రశ్న. ఇదేం కథగాదు ఏదో సమాధానం, ఏదో సన్నివేశం కల్పించుకుని దాటుకుపోడానికి.

వర్షం కురుస్తూనేవుంది. అంతా చల్లబడింది. కాని విశ్వంలోని ఆవేదనావేశం క్షణక్షణానికీ ఎక్కువవుతోంది.

దూరాన్ని కచేరీ బిల్డింగ్సు కనిపించగానే విశ్వం హృదయం పదిహేనేళ్లు వెనక్కి తిరిగింది.

"ఆరోజు తను క్రొత్తగా ఆఫీసులో జాయిను అయినరోజు తను చాలా హుషారుగావున్నాడు. బి.ఎ. ప్యాసయిన వేసవిలోనే సర్వీసు కమీషను ప్యాసై గుమాస్తాగిరీ ప్రారంభించిన రోజు! జీవిత సౌఖ్యంకోసం తహతహలాడుతూ, క్రొత్త అనుభవాల్ని కోరే యువకప్రాణం తనది. చుట్టుప్రక్కల ప్రతీవారూ తనకి ఎంతో ఉత్సాహంగానూ, సంతోషంగానూ కనుపించారు. హోటలు అయ్యరూ, కిళ్ళీకొట్టు అప్పన్నా షాపులోని సేట్‌జీ అంతా ఎంతో హుషారుగా అవుపించారు. ఆఫీసుఫైల్సు తనని నవ్వుతూ ఆహ్వానించేయి. ఆఫీసరంటే తనపాలిటి దేవుడులా కనిపించాడు. ఎంత మధురమైన క్షణం! ఎన్ని కలలుకన్నాడు? ఎన్నో తియ్యని కోరికలు రేకెత్తేయి తనలో భవిష్యత్తును వూహించుకుంటూ. తనకి క్రమంగా ప్రమోషనుమీద ప్రమోషను అయి పది పదిహేనేళ్ళలో డిప్టీ కలెక్టరు అయిపోదాం అంటూ ఏవేవో ఆశా హార్మ్యాలు నిర్మించుకున్నాడు తన లేత హృదయంలో... తన వుబలాటం చూసి ముసలి హెడ్డు గుమాస్తా జాలిగా నవ్విన చిరునవ్వులోని అర్థం గ్రహించడానికి తనకి ఎన్నాళ్ళు పట్టింది!"

అయ్యరు హోటలు దాటిపోయాడు విశ్వం. "ఆ హోటలు తనకిప్పుడు అందని ద్రాక్షపండు. అరకప్పు కాఫీ త్రాగే సమర్థతలేదు తనలో"

అప్పన్న రమ్మన్నట్లు మొహం పెట్టేడు "భాయికి దయలేదు" "నువ్వే నయంరా నాకంటే" అనుకున్నాడు మనస్సులో తను.

విశ్వం అమాయకంగా నవ్వుకున్నాడు.

"తను సిగరెట్టు కాల్చి ఎన్నిసంవత్సరాలైంది! ఈ చలిగాలిలో వేడివేడిగా ఓ అరకప్పు కాఫీ త్రాగి, ఓ సిగరెట్టు ముట్టిస్తే?" ఎవరింట్లోంచో మధురగీతి వినిపిస్తోంది. విశ్వం ఒక్కక్షణం తన్మయుడై ఆ పాటలో లీనమైపోయాడు. గత మధురస్వప్నాలు మళ్ళా జ్ఞాపకంవస్తున్నాయి. విశ్వం స్టూడెంటు జీవితం, శారదతో క్రొత్త కాపరం జ్ఞప్తికివచ్చేయి. ఇంతలో ఝెళ్లుమని కొరడా దెబ్బలా వినిపించింది శారద హీనకంఠస్వరం..."చంటాడి పాలడబ్బా ఐపోయింది..." చటుక్కున వాస్తవికతలోకి త్రుళ్ళిపడ్డాడు విశ్వం. మళ్ళీ చంటాడి ఏడుపు జ్ఞాపకంవచ్చింది అప్పన్న కొట్టు తలుపుమీద అంటించిన గ్లాస్గో అడ్వర్టయిజుమెంటు బొమ్మను చూడగానే.

"ఎందుకొచ్చిన వ్యామోహం? తన కాసౌఖ్యం ఈ జన్మలో ఇకలేదు..." సాగించేడు ప్రయాణాన్ని విశ్వం. గీతిక క్రమంగా దూరమైపోయింది.

మిఠాయి అమ్మే చెంచయ్యని చూడగానే విశ్వానికి ఎక్కడలేని కోపం పుట్టుకొచ్చింది.

వెధవ కొంటిచేష్టలూ వీడూనూ. బాబిగాడు కొని పెట్టమని ఒకటేగోల. జేబులో పైసాలేదు. వీడు ఓపట్టుని వదల్డే? తమ ఇంటిముందే తమ కేసి చూస్తూనే పదిసార్లు తచ్చాడు తాడు. బాబిగాడినెల్లా వూరుకోబెట్టడం? వాడికేంచెపితే ఏం తెలుస్తుంది?...ఇంతకీ చెంచయ్యే నెందుకూ అనటం. వాడిబ్రతుకు తెరువు అది. తన ప్రయోజకత్వానికి తనమీద తనకే కోపంవచ్చింది.

శేట్ జీ షాపు గాటిపోతున్నాడు విశ్వం. తను శారదకి చీరకొని ఎన్నాళ్లైంది! పాపం వున్న రెండుచీరెలతోనే గుట్టుగా కాలక్షేపం చేస్తోంది. తనకి ఉద్యోగమై మొదటినెల జీతంరాగానే ఎంతో వుబలాటంతో ఎకాయకీని ఆఫీసునుంచి శేట్ జీ షాపులోకి వెళ్ళేడు. అప్పటి తన వుత్సాహంచూస్తే పాపంతా తనేకొనేసేటట్లు కనిపించాడు.

"ఆయియే మహారాజ్" అని శేట్ జీ నవ్వుతూ ఆహ్వానించేడు. తను ఆక్షణంలో ఓ చిన్నజమీందారుననుకున్నాడు. ఆవేళ తనుకొన్న జరీచీర శారదకి ఎంతచక్కగా అమిరింది? ఆ జరీచీర కట్టుకున్న శారద సుందరవిగ్రహం తనకళ్ళెదుట కనిపించింది...ఆ విగ్రహంస్థానే చిరుగులు కుట్టుకున్న కుట్లతో ఆ జరీచీర ఇప్పటికీ కట్టుకుంటూన్న శుష్కించిన శారద దీనవిగ్రహంనిల్చింది!

ఆఫీసుసమీపించింది. బరువునడకల్తో నెమ్మదిగా మెట్లెక్కుతున్నాడు విశ్వం... "ఒకటీ, రెండూ...పది. అబ్బ! ఎన్నివేలసార్లు లెక్కెట్టేడు తను ఎక్కినప్పుడల్లా!

బీటలుతీరిన ఆఫీసుటేబిలూ, చెయ్యివూడిన కుర్చీ మొద్దుగా, మెత్తగా అతన్ని ఆహ్వానించేయి. రేక్స్‌లోంచి, రోజురోజుకీ పెరిగిపోయే ఫైల్సు అతనికేసి తొంగిచూస్తున్నాయి. జవానుపద్దయ్య గుండుసూదులు గుచ్చుతున్నాడు కుషన్‌కి.

విశ్వం ఫైల్సులో మునిగి పోయాడు. "నీ విధివ్రాత నీకీఫైల్సురాతే" అని అపహాసిస్తోంది-అతన్ని దాటుకుపోయే అదృష్టదేవత.

వర్షంజోరు ఎక్కువైంది. విశ్వం కలంజోరూ ఎక్కువైంది. చంటాడి ఏడుపూ, శారద హీనస్వరం, వర్షంచప్పుడూ, అన్నిటినీమింగిని ఆఫీసరు కేకలూ, బీటలువారిన టేబిలూ— జీవచ్ఛవమైన చేతకాని విశ్వం హృదయంఅంతా గందరగోళంగా వుంది. పదిహేనేళ్ళనించి అల్లా రాస్తూనే వున్నాడు విశ్వం. ఇంకాముందుకూడా అల్లాగే రాస్తాడు. ఎంతవరకో? ఎన్నాళ్ళవరకో?

---

# 'ఎక్స్రే' కళ్లలోంచి—

చొప్పదంటు యిక్షుదండమ్ముగా
   గాజుబుగ్గ చంద్రఖండమ్ముగా
కానుపించు నీ మంచు కళ్లలో
కనాలలో
లలాలలో

చాటుపేర్లతో సరాగ మెందుకు
సత్యమన్న కోపరాగ మెందుకు
నిప్పు నీళ్లలోన దాటువా పే
ద గారిడీ
దగాపడీ

తుమ్మపువ్వు పద్మమ్ము సాటియా
కాశఘాసమే కల్పవాటియా
నీవుమెచ్చితే కొంగపిల్ల హం
స పోతమా
కపోతమా

నీది నేతిబీరకాయ వేషం
నీది పాతచింతకాయ రోషం
తెలిసిపోయె నిలిచినావు మోకా
టి లోతులో
వాలోహిలో

శరధి గర్జనలు చెవికి గిట్టవా
కాళనారద రవాలు వర్ధివా
టిక్కుటిక్కు చప్పుళ్లు నీదు చెవి
కి విందులా
పసందులా

ఇంతకైన నీ పంథమార్చుకో
కంఠశోష కాసంత తీర్చుకో
రమ్ము గీతిహస్తమ్ము సాచితిని
స్పృశించగా
హసించగా.

—సి. నారాయణరెడ్డి.